# మసక మబ్బులు

"ఇది శుభదినం. మన మూడుముళ్ల బంధాన్ని గుర్తుచేసే రోజు మహానుభావా!" మంగళసూత్రాన్ని భర్త చెంపలకు రాస్తూ సిగ్గుల బుగ్గలతో కవ్వించింది ఉషారాణి. "ఈ రోజు మన పెళ్లిరోజు పండగ."

"వావ్! అయితే ఈ రోజంతా తమరి కొంగుపట్టుకు తిరగాలన్నమాట." ఆబగా ఒడిలోకి లాక్కున్నాడు శశిధర్. గుండెల మీద వాలి గిలిగింతలు పెట్టింది. ఇద్దరి ఆనందములో పాలుపంచుకుంటూ మంచం గమ్మత్తుగా మూల్గింది. "కాని... ఉషా!" శశిధర్ బుర్ర గోక్కున్నాడు. "నీ మెడలో మూడుముళ్లేసి ముప్పైరోజులేగా అయింది. అప్పుడే మ్యారేజీడే సెలబ్రేషనా?" ఒరుసుకుంటున శ్వాసల్లోంచి ఓరగా చూశాడు.

"అందంతే ఇది మార్షలార్డర్." మంచమ్మీద పడున్న మల్లెల్ని తడుముతూ మూతి సున్నా చుట్టేసింది.

"అపుడే పనిలోకి దిగాలా?" బుగ్గ గిల్లాడు.

"తెల్లారి పోయింది. కిటికీలోంచి చొచ్చుకొచ్చిన లేత సూర్యకిరణాలు నా బుగ్గలనింతకు ముందే తాకాయి తెల్సా! ఇవ్వాళ్ల మీ ఫ్రెండ్స్‌ను టీ పార్టీకాహ్వానిస్తామన్నారు. గుర్తుందా లేక గుటుక్కున మింగేశారా?" మంచం దిగింది. గాజుల గలగలలు కమ్మగా ఉన్నాయి.

"ఇది హనీమూన్ కాదు హీరోగారూ!" ముంగురులు సవరించుకుంది. "కొత్తకాపురం... సంసారసాగరములో మునకలేస్తున్నాం." ముక్కుబట్టి లాగి వదిలేసింది.

"ముందు తమరిలా దయచేయండి హీరోయిన్ గారూ!" చెయ్యందుకోబోయాడు. లేడిపిల్లలా గెంతి పక్కకు జరిగింది.

"దేవిగారిని మా ఫ్రెండ్సుకు పరిచయం చెయ్యాలి. నీ కోమల హస్తాలతో వాళ్లకు గరంచాయ్ అందించాలి." చేతులు చాచి చెంపలు అందుకోబోయాడు.

"అబ్బో! ఆశ, దోశ, అప్పడం" మరింత దూరం జరిగింది.

భారంగా లేచి మంచానికి కాళ్లువేలాడదీశాడు. బుర్రలో బల్బు వెలిగింది. "అవునుగానీ ఈ రోజు రూలింగ్‌పార్టీ బంద్‌కాలిచ్చింది. ఆఫీసులకు సెలవిచ్చారు డియర్! కాని టీ.వి.లో ఇండియా-పాకిస్తాన్ ట్వంటీ ట్వంటీ క్రికెట్ మ్యాచ్ లైవ్ రిలే అవుతుంది. అది చూస్తూ టీపార్టీలో తేలిపోతూ ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చెయ్యొచ్చు." కొంగు అందుకోబోయాడు.

"అవ్వవ్వ!" మూతి మూడు వంకర్లు తిప్పుతూ కొంగులాక్కుంది. హంసలా అడుగులేస్తూంటే పట్టాగొలుసుల మువ్వల సవ్వడి కర్ణపేయంగా వినబడింది.

శశిధర్ సెల్‌ఫోన్ అదేపనిగా పంజేసింది. తొమ్మిదింటికల్లా టీపార్టీకీ రావాలని మిత్రుల నాహ్వానించాడు. పేరంటానికి వెల్తున్నట్టు పాంటు, షర్ట్... టక్ చేసుకున్నాడు. అద్దం ముందు నించుని తృప్తిగా నవ్వుకున్నాడు.

సరిగ్గా సినిమాషో టైంకు థియేటర్‌కు చేరుకున్నట్టుగా మిత్రులంతా తొమ్మిదికల్లా వచ్చేశారు. పలకరింపులు, కరచాలనాలు పూర్తిచేశారు. టీ.వీ. ముందువేసున్న కుర్చీల్లో ఠీవిగా కూచున్నారు. లోకాభిరామాయణం, జోకులతో నవ్వుల పువ్వులు విచ్చుకున్నాయి. అంతకు ముందు రోజు తెచ్చి రెడీగుంచిన స్వీటు, ఖారాను కాయితం ప్లేట్లలో సర్వ్‌చేశాడు శశిధర్. చేతికి మూతికి పనిచెప్పారంతా. ఏయే మోడ్రన్ స్వీట్సు ఏ స్వీటు హౌజ్‌లో లభిస్తాయనే అంశంమ్మీద ఆసక్తికరమైన చర్చ జరిగింది.

ముద్దమందారం మొహం, చారడేసి కళ్లు... పట్టుచీరలో పట్టపురాణిలా తయారైంది ఉషారాణి. శశిధర్ లోపలికొచ్చి "వావ్! శచీదేవిలాగున్నావు సుమా!" చెయ్యందుకుని దగ్గరకు లాక్కోబోయాడు.

"చాల్లెండి సంబడం! మీరు పదండి. నేను చాయ్ తీసుకొస్తా!" భుజాలు పట్టి వెనక్కు తిప్పింది.

ఇంకొద్దిసేపట్లో ట్వంటీ ట్వంటీ క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కాబోతుంది. చూసితీరాలనే ఆతృత ఉబికొస్తోంది.

"నీ బెటరాఫ్‌ను ఎప్పుడు పరిచయం చేస్తావురా?" కోవాపేడాను లాఘవంగా లాగిస్తూ అడిగాడో మిత్రుడు.

"త్వరలోనేరా! ఈ రోజు నా పెళ్లి రోజురా" ఖారా పనిబడుతూ సగర్వంగా ప్రకటించాడు శశిధర్. "స్విచ్ ఆఫ్‌చేసిన సెల్‌ఫోన్‌లా అంతా అవ్వాయ్యారు. అయోమయంగా మొహాలు చూసుకున్నారు. ముక్కుమీద ఈగను కసిగా తోలుతూ ఓ మిత్రుడు "అం...టే...మాకెవరికీ తెలియకుండా సంవత్సరం క్రితమే దొంగపెళ్లి చేసుకున్నావురా దుర్మార్గుడా!" బుసకొట్టాడు. ముందున్న కంప్యూటర్ ధామ్మని పేలిపోయినట్టు.. ఉలిక్కిపడ్డాడు శశిధర్. నముల్తున్న ఖారాను మింగలేక కళ్లు మిటకరించాడు.

ఇక్కడో కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడిందని అర్జంట్‌గా అర్థమైంది. మందహాసం చిందిస్తూ "అదికాదురా బాబూ! పెళ్లిరోజంటే మ్యారేజి అనివర్సరీ కాదు. పోయిననెల ఇదే తారీకున నా పెళ్లయిందిరా!" భుజం తట్టాడు.

"అయితే ఇది సంవత్సరీకం కాదన్నమాటా!" పక్కన పరవశిస్తున్న మిత్రుడు నిట్టూర్చాడు. గొల్లుమని నవ్వారంతా. వెనకున్న మిత్రుడు నవ్వాపుకుంటూ "ఓరి వెర్రినాగన్నా! సంవత్సరీకమంటే తద్దినంరా!" నెత్తిమిదో మొట్టికాయ వడ్డించాడు.

"అట్లనా! నాది ఇంగ్లీషు మీడియంరా. సెకండ్ లాంగ్వేజ్ సంస్కృతం. అయితే ఇది మాసోత్సవ మన్నమాటా!"

"అవున్రా. యూ ఆర్ రైట్" శశిధర్ ఊపిరి పీల్చుకున్నాడు. "ఉండండి నా బెటరాఫ్‌నిప్పుడే తీసుకొస్తా" ఈలవేస్తూ హుషారుగా లోపలికెళ్లాడు. ఐదు నిమిషాల్లో తిరిగొచ్చాడు.

గాజుల చేతుల్లో కప్పుల ట్రే, బుగ్గలనిండా సిగ్గుల ఛాయలు... అడుగులో అడుగేస్తూ వచ్చింది ఉషారాణి. పచ్చిపాలలో సాయపసుపు రంగరించిన దేహఛాయ, సమపాళ్ల శరీర సౌష్టవంతో మెరుపుతీగ లాగుంది. కళ్లల్లో చురుకుదనముంది. "నమస్తే.. అయామ్ ఉషారాణి." తనను తాను పరిచంయం చేసుకుంటూంటే నుదుటి కుంకుమబొట్టు జ్ఞాననేత్రములా మెరిసింది. ఎర్రని పెదాలమీద తెల్లని చిరునవ్వు ఉషోదయ సమయాన ఒడ్డుకు పరుగెత్తుకొస్తున్న సముద్రకెరటాల నురగ లాగుంది. అయ్యగారు ఒక్కొక్కర్ని పరిచయం చేస్తుంటే అమ్మగారు చాయకప్పు అందిస్తూపోయింది. తానూ ఓ కప్పుతో శశిధర్ పక్కన కూచుంది. నల్లని జడను గుండెలమీదికి లాక్కుంది. అది కొండెక్కుతున్న నల్లనాగులా మెలికలు తిరిగింది.

హావభావాలు ఉదాత్తభావాలను రేకెత్తిస్తున్నాయి.

వేడిచాయ వాడిగా నరాల్లోకి జరజరా పాకుతోంది. ఉత్సాహం ఉరకలేస్తోంది.

"మా శశిధరుడు అమాయకుడమ్మా. కాస్త జాగ్రత్తగా చూస్కో చెల్లెమ్మా." ఓ మిత్రుడు ఖాళీ చాయ కప్పు టీపాయ్‌కప్పగించాడు.

"పాపం! నోట్లో వేలుపెడితే కొరకదు, వెన్నపెడితే నాకదమ్మా. వీడో అమాయక చక్రవర్తి తల్లీ!" ఇంకో మిత్రుని కనుబొమ్మలెగిరి పడ్డాయి.

నవ్వుల పువ్వులు జలజలా రాలి పడ్డాయి.

జడలోని మల్లెదండను సవరించుకుంటూ ఉషారాణి "మీ ఫ్రెండును అపురూపంగా చూసుకుంటాను... సరేనా అన్నయ్యా!" కిలకిలా నవ్వింది. ఆ నవ్వులో నవరత్నాల మెరుపుంది.

"ఇహ చాల్లేరా!" శశిధర్ బుగ్గలమీద సిగ్గులు పొటమరించాయి "క్రికెట్ మ్యాచ్ షురూ కావచ్చు గదా!" అంటూ టీ.వి. ఆన్‌చేశాడు. అందరి చూపులనాకట్టుకుంది టీ.వీ.

ట్వంటీ ట్వంటీ మ్యాచ్ ప్రారంభమై సెకండ్ ఓవర్ నడుస్తోంది. టీ.వీ. స్క్రీనుకతుక్కు పోయిన చూపులు పక్కన ఏం జరుగుతుందో గమనించే పరిస్థితిలో లేవు. ఆటగాళ్లంతా మెరికల్లాగున్నారు. బౌలర్స్ మెరుపులు మెరిపిస్తోంటే బ్యాట్స్‌మెన్ చుక్కలు చూపిస్తున్నారు. ఫోర్లు, సిక్సర్లతో స్టేడియం ఉత్సాహ సంద్రమైంది. రన్నింగ్ కామెంట్రీతో పాటు జనాల కేరింతలు స్పష్టంగా వినిపిస్తూ మిత్రుల నూగిస్తున్నాయి.

"ఈసారి ఇండియా గెలిచి తీరుతుందిరా!" పక్కవాని భుజమ్మీద చరిచాడో మిత్రుడు. చురుక్కుమన్నా కిక్కురుమనలేదతడు.

"ట్వంటీ ట్వంటీ మ్యాచంటే సస్పెన్స్-థ్రిల్లింగ్ సినిమాలాంటిది. గెలుపోటముల గురించి ముందే చెప్పడం అంత ఈజీ కాదు నాయనా!" ఇంకో మిత్రుడు ముందున్న నెత్తిమీద మొట్టికాయిచ్చాడు.

"ఎందుక్కాదురా! ట్రెండు చూసి చెప్పొచ్చు" మరో మిత్రుడు హుషారుగా లేచి కూచున్నాడు.

"రెండో ఓవర్‌లో ఫస్ట్ వికెట్ ఢమాలైంది. ఇండియన్ టీమంటే అల్లాటప్పా కాదురా బ్రదరూ!" లేని మీసాన్ని ఉన్నట్టుగా మెలేశాడు దెబ్బతిన్న మిత్రుడు.

ఆట మాంచి రసపట్టు మీదుంది. మిత్రుల కామెంట్రీ టీకువనంలో రాళ్లవానలాగుంది. వీళ్లంతా చదువుకున్నోళ్లు. ఉద్యోగాల్లో సెటిలైనారు. క్రికెట్ ఆట చూస్తున్నారా లేక కుర్చీల మీద కోతికొమ్మ ఆడుకుంటున్నారా!... ఉషారాణి ఉడుక్కుంది. లోపలి గందరగోళం బయటపడకుండా జాగ్రత్త పడుతూ కొంగు సర్దుకుంది. జడను లాఘవంగా వెనక్కు వేసుకుంది. ఖాళీ కప్పులు ట్రేలో సర్దుకుంది. రాయంచలా అడుగులేస్తూ లోపలికెళ్లడం ఎవ్వరూ గమనించలేదు. అందరూ క్రికెట్‌మ్యాచ్‌లో లీనమయ్యారు.

పడగ్గది వెచ్చగా... ఉల్లాసంగా ఉంది. బోర్లా పడుకుని దిండుమీద మోచేతులానించింది. అరచేతులు గదవకానించి కాళ్లూపుతోంది. క్రికెటాట కామెంట్రీ, మిత్రుల గోల వినబడుతోంది. తలుపు,వేసి లైటు వెలిగించి వారపత్రిక అందుకుంది. సరసమైన కథను సరదాగా చదివేసింది. ఒళ్లంతా తుళ్లింతలమయమైంది. అప్పుడే మనసు తెరమీద అమ్మ కనబడింది. అమ్మనొదిలి ఇన్నిరోజులు ఎప్పుడన్నా ఉన్నానా? అమ్మ చేతిముద్ద తిని చాలా రోజులైంది. అమ్మతో ఫోన్లో మాట్లాడాలి. శశిధర్ జేబులో సెల్‌ఫోనుంది. అతడు లేచి లోపలికొచ్చినా ఎవ్వరూ గమనించరు.

గుమ్మంపద్దకొచ్చింది. తలుపు ఓరగా తెరిచి చూస్తోంది. క్రికెట్‌మ్యాచ్ జోరుమీదుంది. బౌలర్స్, బ్యాట్స్‌మెన్, ఫీల్డర్స్ ఒకరిని మించి ఒకరు తమ సత్తా చూపిస్తున్నారు. శశిధర్ దృష్టి మరల్చి తనసైగలందుకునే స్థితిలో లేడు. ఛీఛీ... ఉడుక్కుంది.

"వారెవ్వా! ఇండియా బౌలింగ్ సూపర్!" శశిధర్ జబ్బమీద ఒక్కటి అంటించాడో మిత్రుడు. "అవున్రా... యూ ఆర్.రైట్" శశిధర్ చేతివాటం ఆ మిత్రుని భుజాన్ని పచ్చడి చేసింది.

"ఇల్లలుకగానే పండగ కాదురా వెర్రిగన్నా! వాళ్ల బౌలింగ్ గూడా అదరగొడ్తుంది." మరో మిత్రుడు పక్క మిత్రుని చెయ్యిబట్టి లాగాడు. కుర్చీలు గడగడలాడాయి. పడబోయి నిలదొక్కుకున్నారు.

"హల్లో శశిధర్ గారూ!" తలుపు సందులోంచి సన్నని పిలుపు. అది గమ్యం చేరలేదు. శశిధర్ గూడా క్రికెట్‌లో మునకలేస్తున్నాడు. మరో రెండుసార్లు ట్రైచేసింది. ప్రయత్నం బూడిదలో పన్నీరైంది. బుర్రలో బొంగరాలాడుతున్న ఐడియాల్లో ఒక్కటి మెరిసింది. చేయి పైకెత్తి చిటికేసింది. శశిధర దృష్టి మళ్లింది. లోపలికి రమ్మని సైగ చేసింది. "వీళ్లందరి నిక్కడే మదిలేసి వస్తే మర్యాదగా ఉండదుగదా!" సైగలతో చెప్పాడు.

ఛీఛీ... కోతిమూక. ముక్కుమీద కోపం మూతులు తిప్పింది. చిటపటలాడ్తూ గదిలోకెళ్లి మంచాన్నాశ్రయించింది. ఎగసిపడ్తున్న గుండెల్ని కంట్రోల్ చేసుకోవడం కష్టమైంది.

వీరవిహారం చేసిన పాకిస్తాన్ బ్యాటింగ్ పూర్తయింది. కడుపుల్లో ఆకలి ఎలుకల అలజడి ప్రారంభమైంది. "ఇండియా బ్యాటింగ్ ఇంట్లో చూస్తా"మంటూ మిత్రులొక్కరొక్కరే జారుకున్నారు. రేకుల గుడిశెమీది రాళ్లవాన ఆగిపోయినట్లైంది.

"హల్లో... ఉషారాణి గారూ! వంట అయిందా?" నవ్వుతూ పడగ్గదిలో కొచ్చాడు శశిధర్. మంచమ్మీద మూడంకె వేసుంది. ఉలుకూ పలుకు లేదు కాబట్టి కాస్త జాగ్రత్తగా మసలుకోవాలి.

"మేడం గారు అలక పాన్పెక్కారా?" నున్నని చెంపల్ని సన్నగా నిమిరాడు. "ఇది పాన్పుకాదు. ఇక్కడ నులక మంచం లేదు సారువారూ! ఇప్పుడు గుర్తొచ్చానా!" ఒళ్లు మండింది ఉషారాణికి. వంకరగా నవ్వుతూ "వంటా, తంటా ఏదీ లేదు" అటు తిరిగింది. విస్తుబోయాడు.

"అమ్మో! నాకు ఆకలేస్తోంది డియర్!" భుజాలు పొదివి పట్టుకుని లేపి కూర్చోబెట్టాడు. నల్లని కురులు ఎర్రని నుదురు మీద గంతులేస్తున్నాయి. కనురెప్పలు హోరుగాలికి కిటికీ రెక్కల్లా టపటపలాడ్తున్నాయి.

"అయితే రాణి గార్కి కోపమొచ్చిందన్నమాటా!" భుజాలందుకుని బుజ్జగించబోయాడు.

"కోపమొచ్చినా, తాపమొచ్చినా అడిగే వారెవరున్నారనీ! తమరిలోకం తమరిదేనాయె" విసురుగా విదిలించుకుంది.

"సారీ ఉషా! అందరి మధ్యలోంచి హఠాత్తుగా లేచొస్తే బాగుంటుందా? అపుడే జోరుకా గులాం నైపోయా ననుకుంటారు. నా పొజీషన్ కొంచెం అర్థం చేసుకో!" గదవందుకోబోయాడు.

"ఎందుకీ కృత్రిమ ప్రేమాటకం! మనసుంటే మార్గముంటుంది గదా!"

బోర్లా పడుకుని మొహం అటు తిప్పుకుంది. సత్యభామ సన్నిధిలో శ్రీకృష్ణుడులా కాస్సేపు బతిమాలాడు. తలను లాఘవంగా పట్టుకుని తనవైపుకు తిప్పుకున్నాడు రోషంతో ముక్కుపుటా లెగసి పడుతూంటే సిల్లీగా నవ్వి చేతుల్ని తోసేసింది.

ప్రణయకలహం ముదిరితే ప్రళయం ముంచుకురావచ్చు. గోరుతో పోయేది గొడ్డలి దాకా వస్తుందేమో!" లే! హెూటల్‌కెళ్లి తినొద్దాం పదా!"

"పోవయ్యా... పో" అసహ్యించుకుంది. కరంటుషాక్ కొట్టినట్టైంది. "ప్లీజ్ ఉషా! లే... పదా!"

"నేన్రాను."

"నీ ఖర్మ. రోషం నాగ్గూడా ఉంది." శశిధర్ మొహం జేవురించింది. "నేను హెూటల్‌కెల్తున్నా. హాయిగా తినొస్తా! చరచరా బయటికి నడిచాడు. ఆకలి ఆగమాగం చేస్తుంటే నడక స్పీడు పెరిగింది. బజారు నిర్మానుష్యంగా ఉంది. మెయిన్ రోడ్డు, బస్టాండ్ ఏరియా, మార్కెట్ రోడ్.... గంటసేపు సర్వే చేశాడు. హెూటళ్లు, దుకాణాలు... అన్నీ బంద్. కాళ్లు నొప్పులు పుడ్తున్నాయి.

అరెరే! ఈ రోజు బంద్ గదూ! అధికారపార్టీ బంద్ గదూ! ఎరక్కపోయి ఇరుక్కుపోయాన్రా దేవుడా! నీయవ్వ! ఆకలిగ్గూడా బంద్ ఉంటే బాగుండేది. ఈ ఆకలివల్లనే గదా మనిషి పడరానిపాట్లు పడుతున్నాడు... నెత్తికొట్టుకున్నాడు. అలసట ఆవులించి నిస్సత్తువ నీరుగార్చింది. అరువు హుషారుతో ఇంట్లోకొస్తున్నాడు. లోపలి నుండి పాత్రల శబ్దం వినబడింది. వంటవాసన ముక్కుపుటాల్లో చొరవడింది. ఆహా! ఏమినా అదృష్టం! సాంబారు ఘుమఘుమలు సూపర్! వెంటనే అనుమానం గోకింది. నేను హెూటళ్లో తిన్నానని వంట తానొక్కదానికే చేసుకుంటుందేమో! ఆఫ్టరాల్ ఆకలికోసం పెళ్లానికి బానిసై పోవాలా? కాని... విధిలేదు. మరోఉపాయమే లేదు. అలనాడు శ్రీకృష్ణుడికే తప్పలేదు. నేనెంత?

అతికించుకున్న నవ్వుతో వెనకనుండి వెళ్లి కౌగిట్లో బిగించాడు. చెంప గిల్లబోతుంటే విడిపించుకుంది.

"వెరీగుడ్ ఉషా! వంట పూర్తయింది గదా! ఇహ భోంచేద్దామా?"

"వంట నా కోసం చేసుకున్నాను. ఆకలవుతోంది. తమరక్కడ కూచుండి చూస్తుంటే నేను భోంచేస్తాను."

అనుకున్నంత అయింది. ప్రాణం విలవిల్లాడింది. సంభాళించుకోక తప్పలేదు. "భారతనారి భర్తను ఉపవాసముంచి తానొక్కతే భోంచేస్తుందా?"

"భార్యను అశ్రద్ధ చేసి భారతీయుడు హెూటల్లో మెక్కుతాడు గదా!" గుర్రుమంది.

"ఒట్టు డియర్ హెూటలన్నీ బంద్. ఆకలి కేకలు భరించలేకపోతున్నా... ప్లీజ్" పసిపిల్లాడు చాక్లెట్ కోసం పట్టుపట్టినట్టు అడిగాడు. "అబ్బా... ప్లీజ్ డియర్!" వెంటనే స్టయిల్ మార్చాలనుకున్నాడు. "ఆకలేస్తుంది. అన్నంబెట్టు తల్లీ! అమ్మా... తల్లీ! అన్నంబెట్టి పుణ్యం కట్టుకోమ్మా...!" కాస్సేపు ముష్టివాడయాడు.

అయ్యోపాపం! ఇది అధికారపార్టీ బంద్ అని మరిచి పంతానికి వెళ్లొచ్చాడు. అన్నం తినకపోతే అతని ఆరోగ్యం దెబ్బతింటుంది... ఇల్లాలి అంతరాళాల్లోని తల్లి హృదయం వేడితాకిన వెన్నలా కరిగింది. కానీ... మందలింపు లేకుండా దాసోహమంటే అలుసైపోనా! ముఖారవిందము విచ్చుకుంది. కళ్లల్లో తెచ్చిపెట్టుకున్న కోపం... "అధికారపార్టీ బంద్ కాలిస్తే హెూటళ్లు, సినిమాహాళ్లు గూడా బందవుతాయని నాకు తెల్సుబాబూ, వంట మనిద్దరికీ చేశాను." బుగ్గలనిండా సిగ్గులు దొర్లుతూంటే బెల్లులా శశిధర్ నడుముచుట్టూ చేతులు చుట్టేసింది. "ఈసారి ఇలా చెయ్యరు గదూ!"....

¤ ¤ ¤

సాహితీ స్రవంతి
(మార్చి-ఏప్రిల్ 2011)